

డ్రెయినేజీ బిల్లులు చెల్లించరూ..



మంజూరుపత్రాలు, ఎంబుక్ చూపుతున్న దాస్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయినా, బిల్లులు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత కాంట్రాక్టర్ డి.దాసు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోవ్వ గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం మంజూరు కావడంతో పనులు చేపట్టామన్నారు. అయితే నిర్మాణపనులు అప్పులు చేసి గడువులోగాపూర్తి చేశామని, అయితే ఇప్పటివరకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయి బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనిఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ బిల్లులను పూర్తిస్థాయిలో చెల్లించి ఆదుకోవాలని కోరారు.

లండిగూడ వెళ్లాలంటే గగనమే!

- గెడ్డపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు ఇక్కట్లు
- అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల అగచాట్లు
- ముడిసరుకు తెచ్చుకోలేక సాగని గృహ నిర్మాణాలు




గెడ్డను దాటేందుకు హైరానా పడుతున్న లారీలు, జనాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ పరిధిలోని లండిగూడ గ్రామ సమీపంలోని గెడ్డపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఏళ్లతరబడి గెడ్డపై వంతెన లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు స్తంభించే పరిస్థితి నెలకొంటోంది. ఏమాత్రం చిన్నవర్షం కురిసినా, గెడ్డ ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచి అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. లండిగూడ నుంచి .పంచాయతీ కేంద్రం లోతేరుకు,, మండల కేంద్రం అరకులోయకు వెళ్లాలన్నా ఇదే ఏకైక మార్గం కావడంతో గెడ్డను దాటి వెళ్లలేక ఇక్కట్లు పాలౌతున్నామని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టుకుని దాటాల్సిన విపత్కర పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం పీఎం జన్‌మన్ హౌసింగ్ పథకంలో గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్లు మంజూరైనా గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, ఇనుము, సిమెంట్ వంటి ముడిసరుకులను తెచ్చుకోవడం కష్టతరమైన పరిస్థితుల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేక పోతున్నామని వాపోతున్నారు. టిప్పర్ లారీలు, వ్యాన్లు, ఇతర వాహనాలు గెడ్డ దాటి వచ్చే వీలు లేకపోవడంతో నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయని అంటున్నారు. ఇక గర్భిణులు, అనారోగ్య పీడితులను ఆసుపత్రికి తరలించాలంటే అంబులెన్స్ కూడా గ్రామానికి చేరుకోలేని పరిస్థితిలో, డోలీ కట్టి గెడ్డ దాటి మోసుకెళ్లి ఆసుపత్రులకు తీసుకెళ్తున్నామని, ఈ క్రమంలో ప్రాణసాహసం చేయక తప్పడం లేదని లండిగూడ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పలుసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి లండిగూడ వద్ద గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

చాపకింద నీరులా స్క్రబ్ టైఫస్

- ఉమ్మడి విశాఖలో పెరుగుతున్న కేసులు
- అప్రమత్తత కీలకం : వైద్యులు



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలను స్క్రబ్ టైఫస్ వ్యాధి భయపెడుతోంది. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల, దూరపు ప్రయాణాలు చేసి వచ్చిన వారిలో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తుండటం ఆందోళనకరంగా మారింది. ఆగస్టు నుంచి ఈ తరహా వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే విశాఖ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో మూడు నెలల వ్యవధిలో సుమారు 300 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. ఈ బ్యాక్టీరియా బారిన పడిన వారు రాష్ట్రంలో చిత్తూరు, కాకినాడ తరువాత విశాఖలోనే ఎక్కువ మంది ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

వాస్తవంగా ఈ వ్యాధి సోకినప్పుడు లక్షణాలు సాధారణంగా కీటకం కుట్టిన 6 నుంచి 21 రోజుల్లోపు కనిపిస్తాయి. సరైన సమయంలో వ్యాధి లక్షణాలను గుర్తించకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. స్క్రబ్ టైఫస్‌కు చికిత్స అందించడంలో ఆలస్యం ప్రాణాంతకం కావచ్చునని ప్రముఖ ఫిజిషియన్ వైద్యులు డాక్టర్ కె.రాంబాబు అంటున్నారు. ఆకస్మికంగా వచ్చే జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స ప్రారంభిస్తే త్వరగా నయం చేయవచ్చునంటున్నారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఈ వ్యాధిపై మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్‌పై ప్రజలెవరూ భయాందోళన చెందనవసరం లేదన్నారు. కెజిహెచ్‌లో ఈ వ్యాధి నివారణకు అవసరమైన అన్ని రకాల మందులు ఉన్నాయన్నారు. 'స్క్రబ్ టైఫస్ కీటకం కుట్టినప్పుడు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, శోషరస కణుపుల వాపు, వినికిడి తగ్గడం, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనబడతాయి. కీటకం కుట్టకుండా జాగ్రత్త పడటం ఒకటే నివారణ మార్గం. పొదలు, తోటలు, వ్యవసాయ క్షేత్రాలు, తడి నేల ఉన్న ప్రదేశాల్లోకి వెళ్ళేటప్పుడు కాళ్లు చేతులు పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలి. ఇంటి పరిసరాల్లో గడ్డి పెరగకుండా చూసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పాతబడిన దుప్పట్లు, బొంతలు, పరుపులకు దూరంగా ఉండాలి. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరిచి ఎండ తగిలేలా ఉంచాలి' అని చెప్పుకొచ్చారు. ఈ వ్యాధికి చికిత్స ప్రారంభించిన 24 గంటల నుంచి 48 గంటలలోపు రోగులు కోలుకోవడం మొదలవుతుందని వైద్యులు చెబుతున్నారు. మళ్లీ రాకుండా ఉండేందుకు యాంటీ బయాటిక్స్ కోర్సును వైద్యుల సిఫార్సు మేరకు పూర్తిగా తీసుకోవడం ముఖ్యమంటున్నారు. గర్భిణుల్లో అజిత్రో మైసిన్‌ను ప్రత్యామ్నాయంగా వాడొచ్చునంటున్నారు.

స్క్రబ్ టైఫస్ అంటే ఏమిటి?

స్క్రబ్ టైఫస్ అనేది ఓరియంటియా సట్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి. ఇది నల్లిని పోలి ఉండే చిన్న కీటకం. అతి చిన్న పురుగుల లార్వాలతో మనుషులకు వ్యాపిస్తుంది. ఈ పురుగులు సాధారణంగా పొదలు, గడ్డి, అటవీ ప్రాంతాలు, తోటలు, చెత్తాచెదారం ఉన్న ప్రదేశాలలో కనిపిస్తాయి. పొలాల్లో పనిచేసేవారు, తోటల పెంపకందారులు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు ఈ వ్యాధి బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

వ్యాధి లక్షణాలివే..

చర్మం ఎరుపెక్కి దద్దుర్లు వస్తుంటాయి. వణుకు లక్షణాలు కనిపిస్తాయి. శరీరంపై నల్లని మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి సోకిన తర్వాత దగ్గు, జ్వరం, జలుబు, నీరసం లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి ప్లేట్లెట్స్ తగ్గిపోవడంతో పాటు జ్వరం తీవ్రత పెరుగుతుంది. ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడతాయి. రక్తం గడ్డకట్టడం, పచ్చకామెర్లు వంటి ఇబ్బందులు కూడా తలెత్తే ప్రమాదాలున్నాయి. మెదడుపై ప్రభావం చూపకముందే ఈ వ్యాధి సోకిన వారిని వైద్యుల పరిశీలనలో ఉంచడం మంచిది.

వేడి ఆహారం, లిక్విడ్స్ తీసుకోవాలి

ఈ వ్యాధి బారిన పడిన వారు సకాలంలో మంచి పౌష్టికాహారంతో పాటు జ్యూస్‌లు అధికంగా తీసుకోవాలి. శాఖాహారం మాత్రమే తినాలి. మసాలా ఆహార పదార్థాలు, మాంసం తినరాదు. కొబ్బరి నీళ్లు, పండ్ల జ్యూస్‌లు అధికంగా తీసుకుంటూ డీహైడ్రేషన్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా చిన్నారులు, గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. వేడి ఆహారం తీసుకోవాలి. చిన్నపాటి జ్వర లక్షణాలు, ఇతర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఈ వ్యాధి సాధారణంగా వారం రోజుల్లో తగ్గిపోతుంది. పెద్ద ప్రమాదం ఏమీకాదు. అయినా శుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి. స్క్రబ్ టైఫస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు.

పెంచలయ్య హత్యపై నిరసన



అరకులోయలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ప్రజానాట్యమండలి నెల్లూరు రూరల్ కార్యదర్శి, సిపిఎం కార్యకర్త పెంచలయ్య హత్యను నిరసిస్తూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలోని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గంజాయి మాఫియాను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం పాటల రూపంలో పెంచలయ్య ప్రచారం నిర్వహిస్తూ, యువతకు అవగాహన కల్పించేందుకు ఎంతగానో శ్రమించారని తెలిపారు. గంజాయి మాఫియాలకు ఇది నచ్చక, పెంచలయ్యపై వేట కొడవలితో దాడి చేసి దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచలయ్యను నడిరోడ్డుపై హత్య చేసిన నేరస్తులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొద్దు బాలదేవ్, తాంగుల హరి, ఎస్ బాబూరావు, ఎస్ వెంకట్, సంజీవరావు, జయరాం, కృష్ణ పాల్గొన్నారు.

కేశఖండన భవనం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక శివాలయం కొండపైనా, గ్రామ దేవత నూకలమ్మ తల్లి ఆలయం వద్ద కేశఖండన భవనం నిర్మించాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం ఏపీఐఐసీ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణికి విన్నవించారు. కేశ ఖండన భవనం లేకపోవడంతో భక్తులు, నాయీ బ్రాహ్మణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తాటితూరి శ్రీనివాస్, నాయకులు తాటితూరి చిన్న, ఆరిపాక సూరిబాబు తెలిపారు. ఈ ఆలయాల్లో తల స్నానం చేయడానికి కూడా తగిన ఏర్పాట్లు లేని కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు



రోడ్డు పక్క తుప్పలు తొలగిస్తున్న ఓనుకొండ గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని మారుమూల లుంగపర్తి పంచాయతీ ఓనకొండ గ్రామానికి మట్టి రోడ్డు మరమ్మతు పనులు స్థానిక గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానంతో చేపడుతున్నారు. ఇటీవల మొందా తుఫాన్ దెబ్బకు ఓనకొండ రోడ్డంతా పూర్తిగా గోతులమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మెట్టువలస మెయిన్ రోడ్డు నుండి మల్లుంగుమ్మి, మళ్లిపాడు బుర్దగుమ్మితో పాటు ఓనుకొండ వరకు 4 గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో ఇరువైపులా ఏపుగా తుప్పలు పెరగడంతో రాకపోకలకు ఇబ్బంది మారింది. ఇరువైపులా తుప్పలతోపాటు నిండా గోతులమయం కావడంతో కాలినడకన వెళ్లడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉండగా, బైక్‌లు ,ఇతర వాహనాలు దాదాపు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇక అత్యవసర సమయంలో 108 వాహనాలు, అంబులెన్స్‌లు కూడా ఈ మార్గంలో వచ్చిపోయే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

మొంథా తుపాన్ ప్రభావంతో రోడ్డు పాడవ్వడంతో మరమ్మతులు చేయాలని అధికారులను అనేకమార్లు మొరపెట్టుకోవడంతోపాటు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇదేమార్గంలో రైవాడ జలాశయానికి వెళ్లే గెడ్డ కూడా ఉండడంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు చేస్తున్నామని అంటున్నారు. ఇంతటి అత్యవసర రోడ్డుపై అధికారులు, నేతలు నిర్లక్ష్యం చేయడం సరి కాదని అంటున్నారు. సాదారణ రాకపోకలకు కూడా వీలులేనంతగా పాడవ్వడంతో స్వచ్ఛందంగా తుప్పలు కొట్టడంతో పాటు గోతులు పూడ్చే పనులు శ్రమదానంతో చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిటిరోడ్డు మంజూరు చేయాలని గిరిజనులు గెమ్మెల దేముడు, చింత. దేవుడు కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే నాలుగు గ్రామాల ప్రజలను సమీకరించి, జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

కలెక్టర్‌కు విన్నవించిన ఎమ్మెల్యే శిరీషాదేవి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్, ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విన్నవించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్యే మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా గిరిజన రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పందిరి మామిడి నుండి చవిటి దిబ్బలు రోడ్డు, పీఎం కోట రోడ్డు, ఏఎం కోట రోడ్డు చేపట్టాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు అడవి హక్కుల చట్టం ద్వారా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రంపచోడవరం కేంద్రంలో మెయిన్ రోడ్, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. పై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తగా మంజూరైన అంగన్వాడి భవనాల నిర్మాణానికి శాసనసభ్యులతో శంకుస్థాపన చేయాలని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు.

నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు : కలెక్టర్

చింతూరు డివిజన్లోని పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన గిరిజనులకు గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ల్యాండ్ టు ల్యాండ్ ఇచ్చే విధంగా సుమారు 4000 ఎకరాలు భూమి కావలసి ఉందని, అందుకు భూమిని గుర్తించడం జరుగుతుందని తెలిపారు. చింతూరు డివిజన్ నుండి సుమారు 40 వేల మంది ముంపు బాధితులు ఈ ప్రాంతానికి రావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని టూరిజాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. త్వరలో జిల్లా కేంద్రం కానున్న నేపథ్యంలో అధికారులకు, సిబ్బందికి నివాస గృహాలు ఏర్పాటుకు సంబంధించిన నివేదికలు తయారు చేసి సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావుకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

అంబేద్కర్ పార్కులో బోరు ఏర్పాటు



బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రోషిణి

ప్రజాశక్తి- అరకు లోయ: అంబేద్కర్ పార్కులో తాగునీటి కష్టాలకు ఎట్టకేలకు విముక్తి లభించనుంది. దీనిపై పలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించని స్థితిలో చివరకు స్థానిక జెడ్‌పిటిసి శెట్టి రోషిణి దృష్టికి సమస్య వెళ్లడంతో ఆమె తన కోటా జిల్లా పరిషత్ నిధులతో అరకులోయ అంబేద్కర్ పార్కులో మంచినీటి బోరును మంజూరు చేశారు. మంగళవారం రిగ్ వాహనాన్ని రప్పించి దగ్గరుండి బోరు పాయింట్ తవ్వకం పనులు చేపట్టి, పర్యవేక్షించారు.

అంబేద్కర్ పార్కులో నీటి సదుపాయం లేకపోవడంతో ఏ పని చేపట్టాలన్నా ఇబ్బంది ఉండేది. అందరికీ ఉపయోగపడే అంబేద్కర్ పార్కులో మంచినీటి బోరు మంజూరు చేయాలని అరకులోయ అంబేద్కర్ సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు ఇటీవల జెడ్‌పిటిసి సభ్యురాలు శెట్టి రోషిణి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి బోరు వేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు బోరు వెల్ మంజూరుచేయించి, తవ్వించే పనులు చేపట్టారు. ఎట్టకేలకు అంబేద్కర్ పార్కులో నీటి సమస్య పరిష్కారమౌతుండడంతో బోర్ వేల్ మంజూరు చేసిన జెడ్‌పిటిసి శెట్టి రోషిణిని అంబేద్కర్ సంక్షేమ సేవా సంఘాల ప్రతినిధులు,స్థానికులు, అభినందించారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చెరుకుంపాలెం పంచాయతీ పరిధిలోని వైసిపికి చెందిన సుమారు 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసిపి నాయకులు మడకం కమలాదేవి, కొప్పిశెట్టి వీరబాబు, యల్లపు వెంకన్న, చింతలపూడి సత్యవతి, బర్నికల శ్రీను, పూసం సత్తిబాబు, పొడుగు లక్ష్మీ, కొడవలి రాజు, పొత్తూరి గణపతి, మిరియాల మల్లేశ్వరరావు, మిరియాల సత్తిబాబు, కుంజం బాలరాజు, కుంజం నాగేష్, బర్నికల అప్పన్న తదితర కుటుంబాల వారు టిడిపి తీర్థం పుచ్చుకోగా, వారికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి టిడిపిలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సీనియర్ నాయకులు గణజాల తాతారావ్, ఎంపిటిసిలు మీనవల్లి సుబ్బారావు, నల్లా సత్తిబాబు, నాయకులు ముప్పన సావిత్రి, జెట్టి మధు, సూరిశెట్టి సురేష్, తమదాల సత్యనారాయణ, గట్టి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణకు ఎంపికైన యువతతో సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ మనోజ్‌కుమార్

ప్రజాశక్తి -చింతపల్లి: మన్యం ప్రాంతాల్లో నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని సిఆర్‌పిఎఫ్ 234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని జికె.వీధి, రాళ్లగడ్డ, పెద్దవలస, గుర్తేడు గ్రామాలకు చెందిన యువతను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డిఎన్) విశాఖపట్నం సమన్వయంతో 234 బెటాలియన్ సహకారంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. శిక్షణకు ఇప్పటివరకు చింతపల్లిలో 40 మంది నిరుద్యోగ యువత నమోదు చేసుకున్నారని, వారిలో 25 మంది పురుషులు, 15 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా గిరిజన యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, అలాగే భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు పొందే వీలుంటుందని కమాండెంట్ యాదవ్ అభిప్రాయ పడ్డారు.కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. శ్రీనివాసన్, విశాఖపట్నం సిఎంఎస్ ల్యాబొరేటరీ డైరెక్టర్ జగదీశ్‌రావు, ఎండి. శ్రీనివాసరావు, సిఆర్‌పిఎఫ్ ఇన్స్పెక్టర్ ఎం. అయ్యప్పన్, చింతపల్లి సివిల్ సీఐ వినోద్ బాబు, సిహెచ్ఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛను సొమ్ముతో వెటర్నరీ అసిస్టెంట్ పరారీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ఎం.మాకవరం సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీకి ఇచ్చిన సొమ్ముతో వెటర్నరీ అసిస్టెంట్ పరారైన సంఘటన కలకలం సృష్టించింది. చింతలపూడి పంచాయితీ పరిధి లొద్దిపాకలు, లుబ్బర్తి గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము రూ.2.88 లక్షలతో ఎం.మాకవరం గ్రామ సచివాలయానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ చైతన్య అదృశ్యమయ్యాడు. ఫించన్ సొమ్ము కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుమిత్ర ఈ మొత్తాన్ని డ్రా చేసి వెటర్నరీ అసిస్టెంట్‌కి అప్పగించారు. ప్రస్తుతం వెటర్నరీ అసిస్టెంట్ చైతన్య విధులకు హాజరు కాకుండా, పింఛన్లను పంపిణీ చేయకుండా, తన సెల్‌ఫోన్ రింగ్ అవుతున్నా అందుబాటులో లేకుండా పోయాడు. ఈ విషయంపై కొయ్యూరు ఎంపీడీఓ ప్రసాద్‌కు, కొయ్యూరు పోలీస్ స్టేషన్‌కు మంగళవారం చింతలపూడి పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఎం.మాకవరం పంచాయితీ కార్యదర్శి శివశంకర్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని చెప్పారు. ఈ విషయమై కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పింఛను డబ్బుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

కో-ఆర్డినేటర్ పోస్టులను

గిరిజనులతోనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ అరకులోయ, పాడేరు, చింతపల్లి కేంద్రంలో ఆర్ఐటీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్సుల్లో కోఆర్డినేటర్ పోస్టులను నియామకంలో స్థానిక గిరిజన నిరుద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక యువత కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లోనే నైపుణ్యం, అర్హత కలిగిన అనేక మంది యువత ఉన్నప్పటికీ, ఈ శిక్షణ కోఆర్డినేటర్ పోస్టులకు ఇతర, మైదాన ప్రాంతాల వ్యక్తులను నియమించడం అన్యాయమని ఆక్షేపించారు.గిరిజన ప్రాంతాల యువత ఇప్పటికే విద్య, ఉపాధి అవకాశాల కోసం పోరాడుతున్న సమయంలో మైదాన ప్రాంతాల అభ్యర్థులకు అవకాశాలు కల్పించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేయడానికి అర్హతగల, శిక్షణ పొందిన యువత చాలామంది ఉండగా, స్థానికులకు అవకాశాలు ఇవ్వకపోవడం బాధాకరమని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బలపం సర్పంచ్ రమేష్ నాయుడు

గుంజివీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- చింతపల్లి : మండలంలోని బలపం పంచాయతీ గుంజివీధి గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. 15వ ఆర్థిక నిధులతో రూ.5 లక్షల అంచనా వ్యయంతో గ్రామంలో 95 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు బలపం పంచాయతీ సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు తెలిపారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామవీధుల్లో వర్షాకాలంలో రోడ్డు అధ్వానంగా మారుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కొన్నాళ్లుగా కోరుతున్నారన్నారు. ఎట్టకేలకు ఆర్థికసంఘం నిధులతో రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. రోడ్డు పనులు పూర్తయితే రాకపోకల కష్టాలు తీరడంతోపాటు పాటు గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి దోహదం చేస్తుందన్నారు. పంచాయతీకి కేటాయించిన నిధులను అభివృద్ధి పనులకు పారదర్శకంగా వినియోగిస్తామన్నారు. మిగిలిన అన్ని వీధులకు ప్రాధాన్యతాక్రమంలో సిమెంట్ రోడ్లు వేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాంగి రామకృష్ణ, రామారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామాభివృద్ధికి సర్పంచ్ రమేష్ నాయుడు చూపుతున్న చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

- 5న మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ ఘనంగా జరపాలి
- వంద రోజుల విద్యా కార్యాచరణ అమలు చేయాలి
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో, మండల స్థాయిలోచిన్న పరిశ్రమలు ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికలు రూపకల్పన చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పరిశ్రమలు, మైన్స్ అండ్ జియాలజీ, పౌరసరఫరాలు, గృహ నిర్మాణం, సంక్షేమం, విద్యా శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మంగళవారం వర్చువల్‌గా సమీక్షా సమావేశం నిర్వహించారు.
జిల్లాలో ఖనిజాల లభ్యతపై మండలాల వారీగా సమగ్ర సమాచారం తయారు చేయాలనీ , క్వారీల నిర్వహణలో ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమస్యలు ఉన్న చోట గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయంతో సమస్య అధిగమించే ప్రణాళికలు రూపొందించాలన్నారు. క్వారీల నుండి వెలువడే కాలుష్య సమస్యను అధిగమించడానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో సమన్వయం చేసుకోని ఎంప్లాయిమెంట్, ఆదాయం జనరేట్ చేసుకునే విధంగా చూడాలన్నారు జిల్లాలో సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా మండలాల వారీగా ఔత్సాహికులైన యువతకు వర్క్ షాప్‌లను నిర్వహించి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలన్నారు కాఫీ, మిరియాలు, పసుపు, చిరుధాన్యాలు, అల్లం, చింతపండు మొదలగు గిరిజన సేంద్రియ ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను మండల ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్‌గా నియమిస్తామన్నారు. వారి ద్వారా ప్రతి మండలంలోనూ ఐదు నుండి పది ఇండస్ట్రియల్ యూనిట్స్‌ను ఏర్పాటుకు ఔత్సాహికులను గుర్తించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేలా ప్రోత్సాహించాలన్నారు. జిల్లా లో ఎంఅండ్ ఎండిటిఎంఇ పరిశ్రమల అభివృద్ధికి మూడు ఐటిడిఏ పరిధిలోని ఎంపిడిఒలు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేకమైన శిక్షణా శిబిరాలు నిర్వహించాలన్నారు.
జిల్లాలో లబ్ధిదారులందరికీ శతశాతం రేషన్ పంపిణీ చేయాలన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించి, ఖరీఫ్‌లో ధాన్యం. జిల్లాలో ధాన్యం సేకరణకు రెండు లక్షల గోనె సంచులు అందు బాటులో ఉన్నాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.
గ్రామాలలో పిఎంఇవై జన్‌దన్, ఇళ్ల నిర్మాణాలను త్వరతగతిన పూర్తిచేయాలనీ, ప్రతి గృహానికి కచ్చితంగా మరుగు దొడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఉగాది నాటికి గృహప్రవేశాలు జరిగేలా ప్రతి వారం నిర్మాణాలకు సంబంధించి ప్రగతి నివేదికలు తయారుచేసి జిల్లా అధికార యంత్రంగానికి అందించాలన్నారు .
జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు సమగ్ర ప్రణాళికలు జిల్లా విద్యాశాఖ అధికారులు తయారు చేయాలన్నారు. ఈనెల 6 నుండి 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారుచేసి అమలు జరిగే విధంగా చూడాలన్నారు. విద్యార్థులు చదువులో మెరుగ్గా రాణించడానికి అవసరమైనటువంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. మెగా టీచర్స్ పేరెంట్ మీటింగులో దీనిపై సమగ్రంగా చర్చించి, తల్లిదండ్రులకు విద్యార్థులకు తెలియజేయాలన్నారు.
రెండు రోజుల వ్యవధి ఉన్నందున మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి వచ్చేటువంటి అలసత్వం చేయకుండా, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, అతిథులు ఎవరెవరు ఏయే ప్రాంతాల్లో పాల్గొంటారో ముందుగానే ప్రణాళిక తయారు చేసుకోని, ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎవరికీ ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్,. తిరుమణి శ్రీపూజ, రంపచోడవరం ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, చింతూరు సబ్ కలెక్టర్, ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్, సిపిఒ పి. ప్రసాద్ , జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వి రమణారావు, జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణం రాజు, మండల ప్రత్యేక అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.



విదేశీ అతిథులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

భారతీయ సంస్కృతిపై పరిశోధన

ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీని సందర్శించిన అమెరికా పరిశోధకులు

ప్రజాశక్తి- అరకులోయ : భారతీయ సంస్కృతి, ఇక్కడి ఆచార వ్యవహారాలు ప్రత్యేకమని అమెరికాకు చెందిన విదేశీ పర్యాటకులు క్రిస్టోఫర్, ఆయన సతీమణి ఇన్సూక్ రోషర్ అన్నారు. భారతదేశంలోని సంస్కృతి, విద్యపై చేస్తున్న పరిశోధనలో భాగంగా అల్లూరి మన్యంలో పరిస్థితులపై అధ్యయనంలో భాగంగా మంగళవారం అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు.కళాశాలలో విద్యాబోధన, జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించడంతోపాటు కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ ఎవరికైనా విదేశాలలో విద్యాభ్యాసం చేయటానికి ఆసక్తి వుంటే తమ వంతు సహాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. విద్య అభివృద్ధికి, అన్నిటికీ మూలమని, విద్య ద్వారానే వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతోపాటు సమాజానికి మేలు చేయగలరని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలోని పరిస్థితులు, విద్యాబోధన, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి ప్రిన్సిపల్, సిబ్బందిని అభినందించారు అనంతరం విదేశీ అతిథులను కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది సన్మానించారు.



పింఛన్ అందజేస్తున్న కూటమి నేతలు

మరణించిన భర్త పింఛను భార్యకు అందజేత

ప్రజాశక్తి -అనంతగిరి : పింఛను లబ్ధిదారుడైన భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పేరిట పింఛనును పింఛనుదారుడి భార్యకు వితంతు పింఛను మార్పుచేసి మంజూరు చేయగా, స్థానిక కూటమి నేతలు లబ్ధిదారుకు మంగళవారం అందజేశారు. మండలంలోని ఎగువ శోభ గ్రామానికి చెందిన పింఛను లబ్ధిదారుడు కొర్రా సీతన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.దీంతో ఆయన పేరిట ఉన్న పింఛను మృతి భార్య కొర్రా సొరుబందికి మార్పుచేసి వితంతు పింఛనుగా మంజూరుచేయగా, మంగళవారం లబ్ధిదారునికి కూటమి నాయకులు మట్టం శ్యామ్, చట్టం మురళీ అన్నారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో అర్హులైన వారిని గుర్తించి భర్త పేరిట ఉన్న పెన్షను వారి భార్యలకు మంజూరుచేసి అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె. సింహాద్రి, సచివాలయ సిబ్బంది చంద్రకళ, అరుణ్, కార్యక్రమంలో టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి జి రమేష్, నాయకులు బుద్ద ప్రదీప్, అప్పారావు,ప్రవీణ్, కొర్రా గాసి, వార్డు సభ్యుడు చిన్నయ్య, పొట్టంగి రాజు, బాలరాజు, చిరంజీవి, సింహాద్రి, జనసేన నాయకులు బుజ్జి బాబు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌తో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి -అనంతగిరి : జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన గ్రీవెన్స్ ద్వారానే సాధ్యమని విజయనగరం ఆర్టీసీ జోనల్ చైర్మన్, టిడిపి అరకు నియోజకవర్గ సమన్వయకర్త సియ్యారి దొన్ను దొర అన్నారు. మంగళవారం మండలంలోని భీంపోలు పంచాయతీ కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు సివేరి సుబ్బారావు ఆధ్వర్యంలో గిరిజనులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అధికారుల దృష్టికి తేవాలంటే ప్రతిశుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందజేస్తే గ్రామాల్లోని ప్రజలు, బాధితులకు అవగాహన కల్పించాలని కూటమి నేతలకు సూచించారు. ఈనెల 28న అనంతగిరి మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రీవెన్స్ ఉంటుందని, మండలంలోని అన్ని 24 పంచాయతీ గ్రామాల్లో సమస్యలను మౌలికంగా కాకుండా లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికితేవాలని సూచించారు. సేంద్రియ విధానంలో రైతులు వ్యవసాయం చేయాలని సూచించారు. కాఫీ, మిరియాలు వంటి గిరిజన ఉత్పత్తులను జిసిసి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. దళారులు, వ్యాపారులు అందించి మోసపోవద్దని, నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జె. విమలమ్మ, బొర్రా సర్పంచ్ జె. అప్పారావు కార్యకర్తలు పాల్గొన్నారు .



ఇంటి పన్ను వసూలు చేపట్టిన అధికారులు

ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలి


ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో ప్రజలు ఇంటి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి ముక్కలి వెంకటరమణ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో 3,600 ఇళ్లు ఉన్నప్పటికీ గృహ యజమానులలో చాలామంది సకాలంలో ఇంటి పన్ను చెల్లించడం లేదన్నారు.
పన్ను చెల్లింపులతోనే రోడ్లు, చెత్త సేకరణ, వీధి దీపాలు, నీటి సౌకర్యాలు వంటి మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని గుర్తుచేశారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లించాలని, పన్ను వివరాలు, రసీదులు, వార్షిక అప్‌డేట్‌లు తక్షణమే అందజేస్తున్నట్టు వెల్లడించారు. పంచాయతీ నిధుల విషయం పారదర్శకత కోసం డిజిటల్ రికార్డులను బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా జాగ్రత్తపడాలని, తడి,పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరచి పంచాయతీ చెత్త వాహనం వచ్చినప్పుడు కార్మికులకు అందించాలని సూచించారు.కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అంబేద్కర్, కంప్యూటర్ ఆపరేటర్ తుచ్చ శివ, సిబ్బంది మంజేటి శ్రీను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

పిఎంఆర్‌సి మరమ్మతులపై నివేదిక సమర్పించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రాజెక్ట్ మానిటరింగ్ రిసోర్స్ సెంటర్ (పిఎంఆర్‌సి) మరమ్మతులకు సంబంధించిన నివేదికలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. పీఎంఆర్సి భవనాలను, యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పిఎంఆర్సిలోని సమావేశపు హాలులో ఉన్న జీడి పిక్కల ప్రాసెసింగ్ పరికరాలు వేరే చోట భద్రపరచాలన్నారు. రానున్న రోజుల్లో ఈ సమావేశ హాల్లో వివిధ రకాలైన శిక్షణలు, సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. పీఎంఆర్సిలో కనీసం 50 మంది ఉండే విధంగా కొన్ని రూములు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీని ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేసి పరిశుభ్రంగా ఉండే విధంగా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, ఏపిడి వెలుగు డేగలయ్య, ఏపిఎం అప్పారావు, డిఈలు నాగరాజు, గౌతమి, డిప్యూటీ తహసిల్దార్ జిలాని, ఆర్ఐ సిహెచ్.నిర్మల, వీఆర్వోలు ఎ.రాజు, శివకుమార్, వైటిసి మేనేజర్ సుధీష్, మండల సర్వేయర్ ఎం.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వాహన తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై సంతోష్ కుమార్ రహదారి భద్రతా నిబంధనలపై యువతకు అవగాహన కల్పించారు. వాహనదారులు నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మైనర్లు ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడప కూడదని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండి చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ పత్రాలు, కాలుష్య ధ్రువీకరణ పత్రం, హెల్మెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, ఇటువంటి ఘటనలు కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టే బదులు నియమాలను పాటించి, సురక్షితంగా జీవించాలని సూచించారు.

ఐఐఎం విశాఖతో ఐఎస్‌ఎఫ్‌బి భాగస్వామ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఐఐఎంతో ఐఎస్‌ఎఫ్‌బి భాగస్వామ్యం కుదుర్చుకుందని, ఇది అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్లకు ఎంతో ప్రయోజనకరమని ఐఎస్‌ఎఫ్‌బి సిఇఒ జోయ్ పరేఖ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐఐఎం విశాఖపట్నం సహకారం ద్వారా విద్యార్థులకు వారి విద్యా ప్రయాణం ప్రారంభ దశలోనే ప్రపంచ స్థాయి అకడమిక్ వాతావరణాన్ని అందించాలన్న తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించాలి

48 గంటల దీక్ష ప్రారంభం



దీక్షల్లో కూర్చున్న నర్సింగరావు, కుమార్, లోకో పైలట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ రైల్వే లోకో పైలట్లు విశాఖలోని దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం వద్ద ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ దీక్షలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రైల్వేను ప్రైవేటుపరం చేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగ ఖాళీలను ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదన్నారు. పలు రైల్వే విభాగాలను ఈసరికే ప్రైవేటీకరణ చేసేశారని తెలిపారు. యజమానులకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకించాలన్నారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌కెఎస్‌వి.కుమార్ మోడీ సర్కారు విధానాలతో లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. లోకో పైలట్ల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఐఎల్‌ఆర్ఎస్ఎ ప్రెసిడెంట్ ఎస్‌పి.పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ వాల్తేరు డివిజనల్ కార్యదర్శి ఎ.భోలానాథ్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే ఉపసంహరించాలన్నారు. 2024 జనవరి 1 నుండి టిఎ రేట్ల పెంపు మాదిరిగా కిలోమీటర్స్ అలవెన్స్‌లో 25 శాతం పెంపుదల చేయాలన్నారు. కిలోమీటర్ల అలవెన్స్‌లో 70 శాతాన్ని ఆదాయపు పన్ను నుండి మినహాయించాలన్నారు. రన్నింగ్ సిబ్బంది టర్న్ అరౌండ్ లేదా హెడ్ క్వార్టర్‌కు దూరంగా ఉండే సమయం 48 గంటలలోపు ఉండేలా చర్యలు తీసుకోవాలని, తదుపరి దానిని 36 గంటలకు తగ్గించాలని అన్నారు. క్రూ నైట్ డ్యూటీని వరుసగా రెండు రాత్రులకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. రన్నింగ్ సిబ్బందికి 10 గంటలకంటే మించిన డ్యూటీ ఆపాలన్నారు. తదుపరి దానిని 8 గంటలకు తగ్గించాలన్నారు. 46 గంటలు కాలానుకూల విశ్రాంతి పాటించాలన్నారు. లోకో క్యాబ్‌లలో టూల్ బాక్స్, ఎస్ఎఫ్‌డిని అమర్చాలన్నారు. వాల్తేరు డివిజన్‌కు సంబంధించి లోకో పైలట్లను 12 గంటల డ్యూటీకి వినియోగించడం, కేవలం 12 గంటల ట్రిప్పు రెస్ట్ మాత్రమే ఇవ్వడం వెంటనే ఆపాలన్నారు. సింహాచలం నార్త్, విజయనగరం వద్ద హెడ్ క్వార్టర్స్, రిలీఫ్ పాయింట్‌ను బైపాస్ చేయడం నిలిపివేయాలన్నారు. డిపిడబ్ల్యూసిఎస్ లోటస్ లోకో పేరిట అసిస్టెంట్ లోకో పైలట్ లేకుండా ట్రైన్లు నడిపించడం ఆపాలన్నారు. ఒకే ట్రైన్ ఆర్డర్‌లో బహుళ ట్రైన్లను నడిపించే విధానాన్ని నిలిపివేయాలన్నారు. రాయగడ రన్నింగ్ రూమ్‌లో కాంట్రాక్టర్‌ను ప్రోత్సహించే విధంగా అమలు చేస్తున్న ఫిక్స్‌డ్ మీల్స్ సిస్టమ్‌ను రద్దు చేయాలన్నారు.

విశాఖ ఎయిర్‌పోర్టును కొనసాగించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెరుగుతున్న విశాఖపట్నం నగరానికి ఎయిర్ కనెక్టివిటీ అత్యవసరమని, ప్రస్తుత విశాఖ విమానాశ్రయాన్ని దేశీయ (డొమెస్టిక్) కేంద్రంగా కొనసాగించాలని కోరుతూ ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక గౌరవాధ్యక్షులు ఆచార్య కెఎస్.చలం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి లేఖ రాశారు. అదేవిధంగా అనకాపల్లిలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. లేఖలోని అంశాలను మంగళవారం మీడియాకు ఆయన తెలియజేశారు. విశాఖపట్నం అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరం నుండి విమానాల సంఖ్యను తగ్గించడం లేదా విమానాశ్రయాన్ని తరలించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విమానాశ్రయాన్ని విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మార్చాలనే ప్రతిపాదనపై ఆయన అభ్యంతరం తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విశాఖ నగరం నుండి 40–50 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఈ దూరం కారణంగా రవాణా ఖర్చులు, ప్రయాణ సమయాన్ని మధ్య తరగతి పౌరులు భరించడం కష్టమని లేఖలో స్పష్టం చేశారు. విశాఖపట్నం వంటి పెరుగుతున్న అంతర్జాతీయ, ప్రాంతీయ కేంద్రానికి విమానాశ్రయం లేకపోతే అది ఒక పెద్ద అవరోధంగా మారుతుందని తెలిపారు.

4 నుంచి ఆర్గానిక్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఆర్గానిక్ మేళాను జయప్రదం చేయాలని, ప్రకృతి వ్యవసాయ రైతుల పంటల ప్రదర్శనకు తరలిరావాలని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ మేళాను ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచ్చేస్తున్నారన్నారు. 6న ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు వస్తున్నారన్నారు. ఈ మేళాను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ గ్రూప్‌లు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ, అగ్రి డిఎన్ఎ వెంచర్స్ సంస్థల నేతృత్వంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

హార్బర్ ఆధునీకరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఫిషింగ్ హార్బర్ హై లెవెల్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. హార్బర్ ఆధునికీకరణ పనుల ప్రగతి, హార్బర్ పరిశుభ్రత, వసతులపై హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ చీఫ్ ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణ్ కుమార్ పనుల ప్రగతిని నివేదించారు. పనులు సత్వరం, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హార్బర్‌లోగల ట్రాఫిక్, పరిశుభ్రత, నీటి సరఫరాపై పోర్ట్ అధికారులతో సమన్వయం చేసుకొని సక్రమంగా జరిగేటట్లు చూడాలని మత్స్యశాఖ జెడి పి.లక్ష్మణరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపెడా డిడి మొహంతి, ఐఐసి ఎడి సుధాన్సు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎమ్ఆర్.ఆశాజ్యోతి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

జిసిసి హమాలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-చింతూరు : జిసిసి హమాలీ కార్మికులకు రెండు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చింతూరు జిసిసి కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ హమాలీ కార్మికులను జిసిసి పరిధి నుండి సివిల్ సప్లై పరిధిలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. జిసిసిగా ఉన్నప్పుడు వారానికి ఒకసారి పేమెంట్ ఇచ్చేవారని, కానీ సివిల్ సప్లైలోకి మార్పు చెందిన తర్వాత రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు పోషించుకోవడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సప్లై అధికారులు గడిచిన సోమవారం నాటికే పేమెంట్ క్లియర్ చేస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. చింతూరు పాయింట్లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు 5 లక్షల రూపాయలు పెండింగ్లో ఉందని, తక్షణమే హమాలీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు అయ్యప్ప స్వామి, రాఘవయ్య, భీష్మారావు, మంగరాజు, రాజయ్య, చంద్రయ్య, చిట్టిబాబు, భద్రయ్య, రామారావు, రాముడు, రాంబాబు, సుబ్బారావు, నాగు, ముత్తయ్య, సీతారామయ్య, నాగార్జున, రమేషు, రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు దుస్తుల వితరణ

ప్రజాశక్తి-సీలేరు : గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయితీ పరమ సింగవరం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన ప్రశాంతి రెడీమేడ్ షాపు యజమాని మంగళవారం దుస్తులు అందజేశారు. ఈ ప్రాంతంలో ప్రశాంత్ అనే టీచరు విద్యార్థులకు మంచి దుస్తులు లేకపోవటాన్ని గమనించి, గిరిజన విద్యార్థులకు ఏదో విధంగా సహాయం చేయాలని దృక్పథంతో రెడీమేడ్ షాపు యజమానితో మాట్లాడి బీద విద్యార్థులకు బట్టలు వితరణగా ఇవ్వాలని కోరారు. 50 మంది విద్యార్థులకు 100 జతలు దుస్తులు అందజేశారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 9 నుంచి 11 వరకూ సెయింట్ ఆంథోనీ ఓల్డ్ తెలుగు ప్రైమరీ స్కూల్‌లో జరిగే విశాఖ బాలోత్సవం మూడో మెగా చిల్డ్రన్స్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంగళవారం విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.భరత్ తేజ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు పి.లచ్చిరాజు, జివి.రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈసారి బాలోత్సవాన్ని విశాఖ వ్యాలీ రోటరీతో కలిసి సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో నిర్వహిస్తున్నామని, బాలోత్సవం బుక్‌లెట్స్‌ను కార్యకర్తలు 400 స్కూళ్లకు తీసుకెళ్లి అందించారని తెలిపారు. స్కూల్స్ నుంచి ఎంట్రీ ఫారాలు నింపి తిరిగి పంపే ప్రక్రియ ప్రారంభమయ్యిందని, స్పందన చాలా బాగుందని తెలిపారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్లలో మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం - లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్లను మారుస్తూ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు పాత నెంబర్ 12805కు బదులు కొత్త నెంబర్ 18501తో నడుస్తుంది. అదేవిధంగా లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు పాత నెంబర్ 12806కు బదులు కొత్త నెంబర్ 18502తో నడుస్తుంది. ఈ నెంబర్ల మార్పు 2026 ఫిబ్రవరి 15 నుంచి అమలులోకి వస్తుందని, రైలు ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని రైల్వే శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.